

# చక్రవ్యూహం

## కప్పగంతుల మల్లికార్జునరావు

**కొత్తగా** చేపట్టిన కాంట్రాక్టు వర్క్ పూర్తి చేయడానికి నాయుడు ఆ నగరంలో రెండు సంవత్సరాలు కుటుంబంతో సహా కాపురం పెట్టాల్సి వచ్చింది. ఆ పని పూర్తయితే నాయుడికి బోలెడంత లాభం వస్తుంది.

నాయుడిది సంపన్న కుటుంబం. జీవించి నంతకాలం సుఖంగా జీవించాలన్నది ఆ కుటుంబ సభ్యు లందరి దృక్పథం. సర్దుకొనే తత్త్వం ఎవరికీ లేదు.

గృహాన్వేషణ ఆరంభించాడు నాయుడు. ఎన్ని ఇళ్ళు చూసినా తను అద్దెకుండే అర్హతగల ఇల్లుగా ఒక్కటీ కన్పించలేదాయనకి. చివరికి శర్మగారిల్లు ఆయనకి నచ్చింది.

శర్మగారిది ఒకప్పుడు జమీందారీ కుటుంబం. ఆ ఫాయాలో శర్మగారి తండ్రి కట్టించిన ఇల్లు అది. శర్మగారికి పిత్రార్జితంగా లభించింది ఆ ఇల్లు మాత్రమే.

జమీందారీ పోకడల్ని వదిలేసి శర్మగారు కష్టపడి స్వయంకృషితో తిరిగి ధనాన్ని ఆర్జించాడు. ప్రింటింగ్ ప్రెస్ పెట్టి దాన్ని వృద్ధి చేసేడు. ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రచురించేడు. అవినీతి మార్గాలు తొక్కకుండానే ధర్మబద్ధంగా బోలెడంత ఆర్జించాడు.

అయితే ఆయన కొడుకులు ఆయన కళ్ళ ఎదుటే ఆయన నిర్మాణం చేసిన వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసేరు. పిచ్చి పిచ్చి మత్తుల్లో పడి ఆయన ఆర్జించిన ధనాన్నంతా నీళ్ళలా ఖర్చు చేసేసేరు.

పిత్రార్జితమైన ఆ ఇంటినీ వారు హారతి కర్పూరంగా మార్చేసేవారే. కానీ, శర్మగారు అక్కడికొచ్చేసరికి నసేమిరా లొంగలేదు. దాంతో వాళ్ళకు కోపం వచ్చి అందినంత మేరకు చేత చిక్కించుకొని తలా ఓ దిక్కుకు వెళ్ళిపోయారు.

వృద్ధాప్యంలో శర్మగారికి మిగిలిన ఆస్తి ఆ ఇల్లే. తల చెడిన కూతురు తన ఇద్దరు కొడుకుల్తో ఆయనకు తోడుగా 'పుట్టిల్లు' చేరింది.


తన ఇంటిని ఎవరికో అద్దెకివ్వటం శర్మగారికి ఇష్టం లేదు. కానీ, భీష్మించుకు కూర్చుంటే ఇల్లు గడిచేదెలా? పైగా మెయిన్టెనెన్స్ సమస్య?

శర్మగారు చెప్పిన అద్దె రీజనబుల్‌గానే ఉంది. నాయుడు బేరసారాలేం చేయలేదు. అయితే మనసులో ఆ ఇంటిని సెటిల్ చేసుకొని ఓ నెల అద్దె బయానా ఇద్దామని నాయుడు అనుకొంటుండగా శర్మగారు ఆ సమస్యను లేవనెత్తేరు.

'అయ్యా! నా పేరుద్వారా మీకు నా కులం తెల్సి ఉంటుంది. మీ పేరేమిటో నేను అడగనేలేదు. కానీ, ఇంతవరకు వచ్చారంటే మనం స్వకులస్థులమనే నేను అనుకుంటున్నాను.'

'కాదు' అన్నట్లు నాయుడు తల అడ్డంగా ఊపేడు.

'అయితే మీ కులం వారికైతేగాని ఇవ్వరన్న మాట! నేను అలా అనుకోలేదు. మీలో చాలామందికి మొదటినుంచి ఉన్న జాడ్యమే




ఇది. నా పేరు నాయుడు. మీ ఇల్లు నాకు అఖ్ఖర్లేదు' అని విసురుగా వెనక్కు తిరిగారు నాయుడుగారు.

'అయ్యా, నాయుడుగారూ! కులాల ప్రాతిపాదికపై గర్వించేందుకు నా వద్ద సిరిసంపదలన్నా లేవు. బ్రహ్మజ్ఞానం అసలు లేదు. పోనీ మరో కులాన్ని ద్వేషిస్తే నేను పొందే లాభం కూడా ఏమీ లేదు. ఎందుకంటే నేను రాజకీయవేత్తను కాదు. కులాల పట్టింపులు లేవని గొప్పలు చెప్పుకొని నన్ను నేనెందుకు మోసం చేసుకోవాలి? నాకు డబ్బు అవసరమై ఇల్లు అద్దె కిచ్చుకొంటున్నాను. బస్సుల్లో, రైళ్ళలో కాస్సేపు ప్రయాణానికే పక్క సీటును ఒకరి కివ్వటానికి సవాలక్ష పరీక్షలు చేస్తారు కదా? అలాంటప్పుడు నా ఇల్లు అద్దె కిచ్చుకుంటున్నప్పుడు, నాతోపాటు నా ఇంట్లో జీవించే వాళ్ళను గురించి ఆలోచించుకోటం తప్పంటారా? మీ మసాలాలూ, వంటల వాసనలూ మాకు పడకపోవచ్చు. అలాంటివాళ్ళను పొరుగున తెచ్చి పెట్టుకొంటే వాళ్ళకూ కూడా సుఖం ఉండదు కదా?'

'చాల్లెండి-మహా పురాణాలు చెప్తున్నారు. మీ కళ్ళ ఎదుటే నా గొప్ప ఏమిటో నిరూపిస్తాను-చూడండి!'

చాణక్య శపథంలా శపథం చేసి వెళ్ళాడు నాయుడు.

అలా వెళ్ళిన ఓ వారం తిరగకముందే ఆ వీథిలోనే అత్యంత ఆధునికంగా నిర్మింపబడ్డ ఓ భవనం అమ్మకానికొస్తే కొనిపారేసి అట్టహాసంగా గృహప్రవేశం చేసేడు.

×× ×× ××

ఎంత కాలంగానో, ఎన్నో ప్రయత్నాలు చేసి, ఎంతో ఖర్చు పెట్టగా పెట్టగా వెంకటేశ్వరరావుకి ఆ ఊరు బదిలీ అయింది. మళ్ళీ మరెవరైనా ఆ ఆర్డరును గద్ద తన్నుకుపోయినట్లు తన్నుకుపోతారేమో నన్న భయంకొద్దీ, ఆర్డరు చేతికి అందీ అందగానే బయలుదేరి వచ్చి కొత్తచోట చేరిపోయాడు.

ప్రభుత్వం తరపున సంవత్సరానికి కొన్ని కోట్ల రూపాయల విలువగల పనులు చేయించటం వెంకటేశ్వరరావు ఉద్యోగం. అతను మంచి భోక్త. భోక్త అన్నవాడికి ఇతరుల ఆకలి తెల్సుకొనే లక్షణం ఉంటుంది. ఇతరుల ఆకలి పట్ల సానుభూతి ఉన్నప్పుడే తన భోక్తృత్వానికి ఫలముంటుందన్న సత్యం తెల్సిన ప్రాక్టికల్ మనిషి అతను.

ఉత్తమ భోక్తల కుండవల్సిన ఎన్నో అలవాట్లు అతని కున్నాయి.

వెంకటేశ్వరరావు తనకు ఒకే ఒక్క బలహీనత ఉందనుకొంటుంటాడు. అది భార్యను వదిలి క్షణం ఉండలేకపోవటం.

అతని భార్య గొప్ప అందగత్తె. అతను అనాకారి. అందువల్ల భార్యపట్ల మనసులో అనుమానం-భయం. కానీ, అతను అందుకు పెట్టిన ముద్దు పేరు ప్రేమ.

వెంకటేశ్వరరావు కొత్తచోట చేరగానే చేసిన మొదటి పని గృహాన్వేషణ.

'నాయుడుగారూ! నా కో మంచి పోర్షన్ చూచిపెట్టండి, సార్.'

నాయుడుగారి కాంట్రాక్టు పనికి, వెంకటేశ్వరరావు అధికారానికి మధ్య చాలా దగ్గర బంధుత్వం ఉంది. అందుచేత వెంకటేశ్వరరావు ఇల్లు కావాలని అడగగానే నాయుడు చాలా సంతోషించాడు. తన అదృష్టాన్ని తల్చుకొని గర్వించాడు.

నాయుడుగారు తన బంగళాలో ఓ పోర్షను అద్దెకివ్వాలని అప్పటికే వో నిర్ణయాని కొచ్చాడు. అద్దె కివ్వటం డబ్బుకొరకు కాదు. తోడుకోసం. భార్య తోడు కావాలని పోరుపెడ్తోంది. వెంకటేశ్వరరావు పెద్ద ఆఫీసరు. తన ఇంట్లోనే కాపురం ఉంటే తన జేబుల్లో ఉన్నట్లేగా?

'ఎక్కడో చూడటం ఎందుకండీ? మీరు కావాలంటే మా బిల్డింగ్‌లోనే వో పోర్షన్ ఇస్తాను' అంటూ వెంకటేశ్వరరావును తీసుకెళ్ళి ఇల్లు చూపించి మర్యాదలు చేసేడు.

'నాకు మీ ఇల్లు నచ్చిందండీ. నాకు వ్యవహారంవద్ద మొహమాటాలు లేవు. అద్దె ఎంత ఇమ్మంటారు?'

అద్దె తీసుకోనన్నాడు నాయుడు. ఇవ్వక తప్పదన్నాడు వెంకటేశ్వరరావు. గత్యంతరం లేక అద్దె అంకె చెప్పేడు నాయుడు. బేరం ఆడి దాన్ని తగ్గించాడు వెంకటేశ్వరరావు. తప్పనిసరై అంగీకరించినట్లు అంగీకరించాడు నాయుడు.

'ఇంకేం? అద్దె సెటిల్ అయిందిగా? నేనివాళే వెళ్ళి మా ఫేమిలీని తీసుకొస్తాను. మా ఫేమిలీని వదిలేసి నేను ఒక్క క్షణం ఉండలేను. మావాళ్ళూ అంతే' అంటూ వెంకటేశ్వరరావు ఆ రోజే సంసారం తీసుకురావటానికి వెళ్ళేడు.

'ఏమండీ! ఆ ఆఫీసరుగారు మనవారేనా? నా కాయన వాలకం చూస్తే మనవాళ్ళలాగా కన్పించటం లేదండీ.'

ఆఫీసరు అన్న ఉత్సాహంలో నాయుడు ఆ విషయాన్ని విస్మరించాడు. భార్య గుర్తు చేయగానే వెంకటేశ్వరరావు ఫేమిలీ చరిత్రను విచారించి తెల్సుకొన్నాడు.

'కొంప మునిగింది. ఆఫీసరు మనవాడు కాదు.'

'మరి మనవాళ్ళు కానివాళ్ళకి అద్దెకెలా ఇస్తామండీ-ఎంత ఆఫీసరవుతే మాత్రం?'

'అదే నేనూ ఆలోచిస్తున్నాను.'

'అసలు వాళ్ళెవరుట?'

'ఎవరంటే...? బీసీ! బీసీ-ఎ, బీసీ-బి, సి, డి, ఎక్స్, వై, జడ్.'

'బీసీ-అంటే?'

'నా బొంద- నన్ను విసిగించకు. బీ అంటే బొమ్మలు. సీ అంటే కొలువు. చాలా?'

×× ×× ××

నాయుడు హఠాత్తుగా మనసు మార్చుకొని తనకి ఇల్లు ఎందుకు అద్దె కివ్వలేదో ఊహించలేనంత వెర్రివాడేం కాదు వెంకటేశ్వరరావు. అలాగని రోషగించుకోలేదు. అతనితో వైరం తెచ్చుకోలేదు. నాయుడు పాడి ఆవులాంటివాడు. తెలివిగా వాడుకోవాలి. నాయుడిలాంటి ధనవంతులకి 'ఇగో' జాస్తి. ఆ 'ఇగో'ని కాష్ చేసుకోగలిగితే నాయుడి ఖర్చుతో ఏకంగా ఆ ఊళ్ళో సొంత ఇల్లే ఏర్పాటు చేసుకోవచ్చు.

ఆఫీసరుగా నాయుడి 'ఇగో'కి తాను విధించబోయే పనిష్‌మెంట్ అదే. తన అధికారాన్ని నాయుడి 'ఇగో'కి జోడించాడు వెంకటేశ్వరరావు.

ఆరు నెలలు తిరిగేలోగా వెంకటేశ్వరరావు సుమారైన ఓ చిన్న బంగళాకు ఓనరయ్యాడు.

×× ×× ××

ఇంటి యజమాని అయ్యాక వెంకటేశ్వరరావుకు కొత్త దిగులు పట్టుకొంది. అందులో ఓ

పోర్షన్ అద్దెకు ఇవ్వాలా? ఇవ్వకూడదా? ఇ స్తే ఓ బాధ. ఇవ్వకపోతే ఓ బాధ.

భార్యను సలహా అడిగాడు.

'హాయిగా ఇల్లు కట్టుకొని అనుభవించక అద్దె కిస్తారా? మీ బుద్ధే అంత. ఏ పదిమంది పిల్లల్ని కన్నారని?'

భార్య వద్దనటంతో అనుమానం కలిగింది వెంకటేశ్వరరావుకు.

తను ఆఫీసులో-ఆమె ఒంటరిగా ఇంట్లో ...అమ్మో!

ఎలాగైనా ఓ పోర్షను అద్దె కిచ్చేయాలన్న నిర్ణయానికొచ్చాడు.

అయితే ఎవరికి పడ్తే వారికి ఇచ్చేవీలు లేదుగా?

తన ఇంట్లో అద్దెకు చేరేవారు తన హోదా కు తక్కువవాడుగా ఉండరాదు. సంసారంలో తనకన్నా వయసులో పెద్దవాళ్ళే తప్ప యువ కులు ఉండరాదు. స్త్రీలు...అందునా ముసలమ్మలు-ఎంతమంది ఉంటే అంత మంచిది.

అన్ని అర్హతలున్న సంసారం చిక్కలేదు-చాలాకాలం.

భార్యాభర్తలు-వో ముసలాయన-ఇద్దరు ముసలమ్మలు ఉన్న వో సంసారంవాళ్ళు తగిలేరు ఆఖరికి.

'ముసలిపీనుగులకి అద్దెకి స్తే ముక్కులూ మూ ళ్ళులూ, రోగాలూ రొష్టూ. కొంపతీ సి ఎవరైనా గుటుక్కుమంటే ఇల్లు పాడుపెట్టా ల్సి ఉంటుంది. ఛీ పాడు. వాళ్ళకు అద్దె కివ్వనండి.'

అలా భార్య అన్నాక ఆ సంసారానికే అద్దె కివ్వాలని నిర్ణయించుకొన్నాడు. తన సంసారానికి పెద్దదిక్కు వాళ్ళు.

అప్పుడు లోపలికి ఓ యువకుడు వచ్చాడు. వెంకటేశ్వరరావుకు విష్ చేసి, తనని పరిచయం చేసుకొన్నాడు.

"మా నాయన చెప్పారండీ మీ ఇంట్లో పోర్షను..."

ఓహో! అతను ముసలాయన కొడుకన్న మాట. వస్తూనే ఇంటినీ, ఇల్లాలినీ పరిశీలనగా చూశాడు యువకుడు. ఇంతలో ముసలాయనకూడా లోపలికి వచ్చాడు.


అతని పేరు రాఘవరావు. మంచి వయసులో అందంగా ఉన్నాడు. చిరుద్యోగి.

వెంకటేశ్వరరావు గుండెలో ఉన్నట్టుండి డేంజర్ సిగ్నల్ వెలిగింది.

'అంతా సెటిల్ అయిందిగా? రెండు రోజుల్లో చేరిపోతాము ఇంట్లో. అడ్వాన్సు ఇదుగో.' ముసలాయన అన్నాడు.

'అలాగే. అడ్వాన్సు ఎందుకు? రెండు రోజు లాగేక చూచుకొందాం లెండి' అంటూ వాళ్ళను పంపించేసేడు.

'అంతా సెటిల్ అయ్యాక ప్లేట్ ఫిరాయించారేం? ఆ అందగాడిని చూడగానే భయమేసిందా? వెధవ అనుమానం బుద్ధి.




ఈ ఇల్లు అద్దెకంటూ ఇ స్తే వాళ్ళ కివ్వాల్సిందే.'

'అదికాదు. మన స్టేటస్ ఏమిటి? వాళ్ళ స్టేటస్ ఏమిటి? అతను ఆఫ్టరాల్ వో చిరుద్యోగి.'

'వోయబ్బ-అధికారం! మీ దిబ్బ స్టేటస్. మనం పుట్టడంతోనే స్టేటస్ పుట్టలేదని గుర్తుచేసుకోండి. మీ పెదనాయన కొడుకు కంటే వాళ్ళ స్టేటస్ తీసిపోయిందా? ఆ ముసలమ్మ లిద్దరు ఎంత మంచివారో! వారికి అద్దె కివ్వాల్సిందే.' పట్టుబట్టింది భార్య.

పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టయింది వెంకటేశ్వరరావుకి. ఆలోచించగా బుర్రలో 'ఫ్లేష్' తళుక్కుమంది.

రాఘవరావు పనిచేసే ఆఫీసుకు ఫోను చేసి అతని వివరాలు అన్నీ సేకరించాడు. హుషారుగా ఇంటి కొచ్చాడు.

'నువ్వు అంత పట్టుబట్టేవు కదాని వారికే ఇల్లు అద్దె కిద్దామని నిర్ణయాని కొచ్చేను. కానీ తీరా విచారి స్తే వాళ్ళెవరో తెల్సింది' అంటూ అతను భార్య చెవిలో ఏదో చెప్పేడు. వింటూనే ఆమె ఆముదం తాగినట్లు మొహం పెటి పెట్టింది.

రెండో రోజు ముసలాయనతో పాటు రాఘవరావుకూడా వచ్చాడు.

'ఇంతకీ మీ కులం ఏమిటండీ?' ఆమే అడిగింది సేరుగా.

'మాకులంతో మీకేమి పని? మీరు ఇంటిని మాకు అద్దెకు ఇస్తున్నారా? మాకులానికా? ఛీ, ఛీ- చిన్నబుద్ధి' అంటూ ఆ యువకుడు తండ్రి చేయి పట్టుకొని బయటకు తీసుకెళ్ళి పోయాడు.

అందమైన రాఘవరావు మొహం ఆ క్షణంలో ఆమెకు వికృతంగా కన్పించింది. వాళ్ళకు అద్దెకిచ్చేది లేదని ఖరాకండీగా చెప్పేసిం దామె!

×× ×× ××

ఊరికి దూరంగా వి సిరేసినట్లు ఉంటే మాత్రమేం? అన్ని సౌకర్యాలతో అందంగా ఉన్న క్వార్టర్సు అది. వాటిలో ఒకదానికి యజమాని అయ్యాడు రాఘవరావు. గృహప్రవేశానికి వెంకటేశ్వరరావు దంపతుల్ని ఆహ్వానించాడు కూడా.

కానీ అదేం చిత్రమో! గృహప్రవేశం అయి మూడు నెలలు తిరగకముందే ముగ్గురు ముసలాళ్ళు బకెట్లు తన్నేశారు. అసలే అద్దెలకు డిమేండ్ లే దక్కడ. దానికితోడు ఈ ఏంటీ సెంటిమెంట్. అద్దెకు చేరేవాళ్ళను రాఘవరావే వెతుక్కోవల్సి వచ్చింది. తన స్థాయివారు చేరరు. లేబర్ స్థాయివాళ్ళ కివ్వటం అతని కిష్టం లేదు.

అలాంటి స్థితిలో ఓ యువకుడు అద్దెకు చేరతానంటూ వచ్చాడు. చిరుద్యోగి లాగే ఉన్నా డతను...మొహంలో ఏదో తేజస్సు.

'ముందు మీ రెవరో చెప్పండి. ఐ మీన్...ఎ స్సీ, ఎ స్టీ, బీ సీ, ఆర్ ఫార్వర్డ్...'

'నేను సగటు మనిషిలో సగాన్నండీ. భారతీయుడిని. మీ రన్న విభజనల్ని నేను పట్టించుకోను. రత్నగర్భ అయిన మన మాతృభూమికి కన్నబిడ్డ లందరూ ఒకటే. ఈ కుమ్ములాటలు...'

'మీరు పట్టించుకోనంత మాత్రాన అవి లేకుండా పోతాయా? రాజ్యాంగంలోనే రాసి పెట్టేరు. మాయ స్సులలోనే అనేక తెగలున్నాయి. కొంపతీసి మీరు...'

'నే నెవరి కొంప తీయనండీ. ఈ క్షణంలో నా తల్లి, తమ్ముడు, చెల్లెలు తల దాచుకొనే చోటు లేక రోడ్డు పక్కన చెట్టుక్రింద నిలబడి ఉన్నారు. కూటికోసం, గూటికోసం, శరీరాన్ని కప్పుకోవటానికి ఇంత గుడ్డపేలికకోసం అనుక్షణం అవస్థపడే మకు కులాల్ని గురించి ఆలోచించే ఓపిక ఎక్కడ ఉంది, సార్? ఒకనాడు-అప్పుడెప్పుడో వ్యక్తులు గుంపులు గుంపులుగా ఉన్నప్పుడు-సమాజ నిర్మాణానికి కులవ్యవస్థ అవసరమయి ఉండవచ్చు. కుల వృత్తులు పోగానే ఆ వ్యవస్థకు కాలం చెల్లింది. దాన్ని సహజంగా మరణించనివ్వరేం? సమాజాన్ని నిలువునా అడ్డంగా మరింతగా చీల్చడానికి సాధనంగా వాడుకొంటారేం? కులవ్యవస్థ నశించాలనేవారికి కుల ప్రసక్తి చేయందే ముద్ద మింగుడు పడదేం? కులం స్వార్థానికి బ్రహ్మాస్త్రమా? అడిగేరు కనుక నేను నిజం చెప్తాను, సార్. నా కులం చెప్పితే మీరు నాకు ఇల్లు ఇవ్వరేమోనని నా భయం. మా తాత బ్రాహ్మణుడు. నాయనమ్మ హరిజన స్త్రీ. మా నాన్న ఓ పాశ్చాత్య స్త్రీని పెళ్ళి చేసుకొన్నాడు. నా సోదరిని...'

'చాల్చాలు-నీ పురాణం. ఉద్యోగం ఏ ఆఫీసులో?'

'ఆఫీసులో కాదు, సార్. బయట. రోడ్డుమీద. నేను నిరుద్యోగిని, సార్...'

'ఏమిటీ? నిరుద్యోగివా? అందుకా ఇంత పెద్ద చరిత్ర చెపుతున్నావు? కేరాఫ్ అడ్రస్ రోడ్డా? నీకు నేను ఇల్లు అద్దె కివ్వాలా? నీ కళ్ళకు నే నంత తలకుమాసినవాడుగా కన్పిస్తున్నానా?...' రాఘవరావు అతడిని బయటికి నెట్టినంత పని చేసి తలుపు వేసుకున్నాడు.

కుల నిర్మూలన గురించి రేడియోలో ప్రసంగం గాలిలో కల్సిపోతున్నది.

ఆ రోడ్డు ఓ పెద్ద పద్మవ్యూహంగా, సమాజం ఒక చక్రవ్యూహంగా కన్పించింది అతనికి. ఎటు పోవాలో తోచక రోడ్డుమీదే నిలబడిపోయా డా సాధారణ నిరుద్యోగి! సగటు మనిషిలో సగం మనిషి! ■